## క్లుప్తంగా

### నకిలీ అర్చక పరీక్షలను రద్దు చేయాలి

భీమవరం: పురోహిత, అర్చక సమాఖ్య పరీక్షల పేరిట నకిలీ సర్టిఫికెట్లతో అక్రమార్జనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్వీఎన్ శర్మ, జి.ధనుష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం భీమవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులకు, పురోహితులకు పరీక్షలు నిర్వహించి, అర్హత పట్టాలు అందజేస్తామని, ఆ పట్టాల ద్వారా పర్సనల్ లోన్లు, బ్యాంకు లోన్లు, విదేశాలకు పాస్ పోర్టులు, రైల్వే ప్రయాణాలకు రాయితీ టికెట్లు పొందొచ్చంటూ ఈ సమాఖ్య రాష్ట్రంలోని అర్చక, పురోహిత విద్యార్థులను నమ్మించి మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సోమవారం భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాలులో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు పలు రకాలుగా ప్రచారం నిర్వహిస్తుందని తెలిపారు.

### ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఇంజనీర్ వీఎస్ రాజు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

కాళ్ల: మండలంలోని వేంపాడు గ్రామంలో వేగేశ్న బంగారమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. వేగేశ్న బంగారమ్మ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వయం కృషి కిడ్స్ కేర్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశ్రీ డా.ఎం.ఆర్.రాజు, ప్రముఖ ఇంజనీర్ వి.ఎస్. రాజు, వేగేశ్న కాశీ విశ్వేశ్వరరాజు, కృష్ణంరాజు, డా.రామకృష్ణంరాజు, డా.గోపాలరాజు, డా.సోమరాజు, డా.రాజంరాజు(పోడూరు), పుల్లంరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు దుస్తుల పంపిణీ

యలమంచిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో యలమంచిలి మండలం నేరేడుమిల్లి గ్రామంలో దీపావళి పండుగ పురస్కరించుకుని ఆదివారం 130 మంది పేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. బుద్ధరాజు సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరాజు, డాక్టర్ దీప్తి మానవత సంస్థ ఉపాధ్యక్షులు కేవీఎస్ఎన్ రాజు, కారుమూరి నరసింహమూర్తి (బాబు), డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు, కోశాధికారి గ్రంధి కుమార వరప్రసాద్, యలమంచిలి మండలం మానవతా సంస్థ అధ్యక్షులు దేగల వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, సీహెచ్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అయ్యప్ప మాలదారులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఘనంగా గ్రామ దేవతల జాతర

పెనుగొండ: ఆచంట గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి తెల్లవార్లూ ఆచంట వీధుల్లో జాతర గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు గరగ నృత్యాలు ఆకట్టుకొన్నాయి. బుట్ట బొమ్మలు, తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు తో హోరెత్తించారు. ఆదివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జాతర మహోత్సవానికి భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### 'ఎంతపని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి

నరసాపురం రూరల్: నరసాపురంలో 'ఎంత పని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సభ్యులు ఆదివారం సందడి చేశారు. స్థానిక కనకదుర్గ థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శితమవుతోంది. ఉదయం ఆట సమయంలో ఎంతపని చేశావ్ చంటి చిత్రంలోని హీరో, హీరోయిన్లు ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. నరసాపురం మండలంలోని వేములదీవి గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించారు. ప్రేక్షకులను సినిమా డైలాగులు చెప్పి అలరించారు. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, హీరోయిన్లు శాంతిప్రియ, నిహారిక, దర్శకుడు ఉదయకుమార్, నటీనటులు, ప్రేక్షకులతో కలసి సినిమా వీక్షించారు.

# వరికి ఎండాకు తెగులు బెడద

- వరుస విఘాతాలతో వరి రైతు కుదేలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



ఎండాకు తెగులుతో ఎదుగుదల లోపించిన వరి చేను

ఆకివీడు: ఎండాకు తెగులు వరిని నులిమేస్తుంది. పుష్కలంగా, ఏపుగా ఎదగాల్సిన వరి మొక్కలు ఎండాకు తెగులుతో ఒడిలిపోతున్నాయి. ఆకులు ఎండిపోయి మొక్క ఎదుగుదల లోపిస్తుంది. దీంతో పాలు, పొట్ట దశలోకి వచ్చి వరి చేలకు ఎండాకు తెగులు మరింత నష్టాన్ని కలిగిస్తుంది. వరి మొక్క ముందుగా పసుపు రంగులోకి మారి, తరువాత ఎండిపోతుంది. ఎండుగడ్డిగా మారిపోతుంది. పిలకలు వేసే సమయం నుంచి కంకులు వేసే వరకూ ఈ తెగులు ఆకులను పీల్చివేస్తుంది. వరిలో ఈ తెగులును తీవ్రమైనదిగా భావిస్తున్నారు. విత్తనాలకు సోకిన తెగులు పంట దశలో మొక్కకు చేరుతుంది. విత్తన శుద్ధితో కొంత వరకూ ఎండాకు తెగులును అరికట్టొచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వర్షాలకు, వరదలకు ఈ తెగులు విజృంభిస్తుంది. అతిగా నత్రజని ఎరువుల వాడకం వలన కూడా తెగులు వ్యాప్తి చెందుతుంది. మొక్కలకు గాలి లేకుండా దగ్గర దగ్గరగా నాటడం వలన తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది. పొట్ట దశ, కంకులు వేసే దశలో తెగులు సోకితే బియ్యం ముక్కలైపోతాయని చెబుతున్నారు. నారుమడి దశలోనూ, నాట్లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పోటాష్‌ను తగిన మోతాదుల్లో చేలల్లో వేయాలి. ఎండాకు తెగులు ప్రస్తుంత పలు గ్రామాల్లోని వరి పంటను విపరీతంగా ఆశించింది. భారీ వర్షాలు, వరదలకు వేలాది ఎకరాల్లో వరి చేలు వరదల పాలయ్యాయి. ముంపు బెడదను తట్టుకొని నిలబడిన వరి చేలకు ఎండాకు తెగులు విస్తృతంగా ఆశించిందని రైతులు వాపోతున్నారు.

### ఆదిలోనే అంతమొందించాలి



మండలంలో అక్కడక్కడా ఎండాకు తెగులు వ్యాప్తి చెందింది. తెగులు సోకిన పది రోజుల్లోనే దీనిని అంతమొందించాలి. వరి చేలల్లో విస్తరిస్తే అంతమొదించటం కష్టం. దీని నివారణకు ప్లాంటా మైసిన్ 400 గ్రాములు ఎకరంలో పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. సల్ఫర్ మందులు వాడాలి. కంకి ఈనిన తర్వాత మందులు వాడినా ఉపయోగం ఉండదు. చేలల్లో కొత్త నీరు పెడుతూ నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి.

–ప్రియాంక, ఏవో, ఆకివీడు మండలం

### 2న లూథరన్ చర్చి వజ్రోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో అతి పురాతనమైన క్రైస్తవ దేవాలయాల్లో రెండోదైన బేతనిపేటలోని గుడ్ సమర్టన్ అగస్టీన్ లూథరన్ చర్చ్ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ చర్చ్ 1949వ సంవత్సరంలో నిర్మించబడిందని, వజ్రోత్సవ వేడుకలు రాబోయే నవంబర్ 2న శనివారం ఘనంగా నిర్వహించాలని సంఘ కార్యవర్గం నిర్ణయించిదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఈఎల్‌సీ అధ్యక్షుడు మోస్ట్ రెవరెండ్ ఫెడ్రిక్ పరదేశిబాబు, వెస్ట్ గోదావరి సినడ్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ పాల్గొంటారని సంఘ కార్యవర్గ సభ్యులు తెలిపారు.

### ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక



డీఈ మధుకుమార్‌తో నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం డివిజన్ ఏపీఎస్ఈబి (విద్యుత్ శాఖ) ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రీజనల్ సెక్రటరీ నీతిపూడి వెంకట్రావు ఆదివారం తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా బి.నరేంద్ర శ్రీనివాస్, కార్యదర్శిగా కె.సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.ప్రభాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కె.నాని, కమ్యూనికేషన్ కార్యదర్శిగా వై.నారాయణరావులతో పాటు నలుగురు కార్యవర్గ సభ్యులుగా ఎంపికచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు డివిజినల్ ఇంజినీర్ కొల్లాబత్తుల మధుకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండి: సనాతన ధర్మం, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రజలు కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి బీహెచ్ శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఉండి మండలం పెదపుల్లేరులోని సత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి విభాగ్ ఆధ్వర్యంలో పెదపుల్లేరు గ్రామ ప్రజల సౌజన్యంతో సహస్రగళ హనుమాన్ ఛాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, తదితరులు కేంద్ర మంత్రితో కలసి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ ఛాలీసా కొరకు పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ సహనుమాన్ ఛాలీసా,జెండాను నిర్వహకులు అందజేశారు. దీంతో ఆలయ ప్రాంగణం మంత్రోచ్ఛరణతో దద్దరిల్లిపోయింది. అనంతరం మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ మన పూర్వీకులు అనుసరించిన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. సంస్కృతీ సాంప్రదాయాలనను భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన భాధ్యత కూడా మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ



ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కాళ్ల: పాలకులు తీసుకునే అసంబద్ధ నిర్ణయాలతో విద్యారంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. కోపల్లె జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చైతన్యవంతమైన బోధన ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దగలరని తెలిపారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ మూడు నేత్రాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం 1974వ సంవత్సరం ఆగస్టు 10న ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు చేసుకుంటుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి తెలిపారు. అనంతరం నూతన కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా వీవీఆర్కే రవికుమార్ రాజు, అధ్యక్షుడిగా బీఆర్ ఎంకే స్వామి, సహాధ్యక్షుడిగా పి.ప్రభుదాసు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు, కోశాధికారిగా ఎల్.అప్పలాచార్యులు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ప్రతి పౌరుడూ పోలీసులా ఉండాలి




పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రతి పౌరుడూ ఒక పోలీసులా ఉన్నప్పుడే శాంతి భద్రతలు పరిరక్షించుకోగలమని అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, బార్ అసోసియేషన్ సభ్యుడు ఉండపల్లి రమేష్ నాయుడు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వారు ఒక్క సైనికులు పోలీసులే అని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు అనే అంశంపై వ్యాసరచన వకృత్వ పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఆర్‌డీఎస్ కళాశాల అధ్యాపకుడు పి.అమూల్యరావు, హాస్టల్ వార్డెన్ శ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.

## మళ్లీ నిరుపయోగంగా ఓపెన్ ఎయిర్ థియేటర్

- రూ.3.50 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రభుత్వం మారడంతో చివరి దశలో నిలిచిన పనులు



గతంలో నిరుపయోగంగా ఉన్న నరసాపురం పాత మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్(ఫైల్)



రూ.3.50 కోట్లతో 90 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: నరసాపురం చుట్టప్రక్కల ఇళ్లలో ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే బయట ప్రైవేట్ కల్యాణ మండపాల్లో లక్షల్లో ఖర్చు. దీంతో మధ్య తరగతి ప్రజలు పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వచ్చాక, అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఆ సమస్యకు, కష్టానికి చెక్ పడే విధంగా అడుగులు వేశారు. నిరుపయోగంగా ఉన్న పట్టణంలోని మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో నరసాపురంలో తక్కువ అద్దె ఖర్చుతో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని భావించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యి, పనులు చివరిదశలో ఉండగా ఎన్నికలు రావడం, పనులు నిలిచిపోయాయి.

**పట్టించుకోని కూటమి సర్కార్**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణ విషయమే పట్టించుకోవడం మానేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ 3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం ప్రారంభమైయ్యింది. పాత భవనాన్ని కూల్చేసి అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. మరో 10శాతం చిన్నపాటి పనులు మాత్రమే మిగిలిఉన్నాయి.

**అప్పుడూ..ఇప్పుడూ అదే తంతు**

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా కూడా, ఆదాయం పెంచుకునే మార్గంపై గతంలో టీడీపీ హయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టలేదు. అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో ఫంక్షన్స్ చేసుకునే వెసులుబాటు కల్పించే యోచన చేశారు. దానిని కొనసాగించలేక ఇప్పుడు కూడా కూటమి సర్కార్ అదే తప్పు చేస్తుంది.

## అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



సీఐ రజనీకుమార్



దీపావళి బాణసంచా వ్యాపారం

పాలకొల్లు సెంట్రల్: అనుమ తులులేకుండా ఎవ్వరైనా బాణ సంచా మందులు తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ కె రజనీకుమార్ హెచ్చరించారు. ఆదివారం దీపావళి బాణసంచా మందుల విక్రయదారులనుద్దేశించి కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ రజనీకుమార్ మాట్లాడుతూ అన్ని అనుమతులతో షాపులు నిర్వహించే వ్యాపారస్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అలాగే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలోనూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందోత్సాహలతో ఉండాలంటే బాణసంచా కార్చే సమయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా బాణసంచా వ్యాపారాలు కొనసాగిస్తే మాత్రం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా విక్రయ, తయారీదారులు తమ పరిసరాల్లో ఇసుక, ఫైర్ సేఫ్టీ సామగ్రి, వాటర్ వంటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. శాశ్వత, తాత్కాలిక లైసెన్స్ కలిగిన వారు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. తాత్కాలిక లైసెన్స్ వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతలు మేరకు ప్రత్యేక షెడ్లుల్లో ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ వినాయక స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రామనామ స్మరణతో కొప్పర్రు గ్రామం మార్మోగింది. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. నిర్వాహకులు సవరం సత్యనారాయణ, ధర్మరాజు దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, భీజన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం శిలా విగ్రహ ప్రతిష్టలో భాగంగా మహాపూర్ణాహుతి, కుంభ కళావాహన, గోదర్శన, కుంభప్రోక్షణ, శాంతి కల్యాణం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలిశెట్టి సీతారామయ్య, పోలిశెట్టి శ్రీనివాసరావు (నాని), చినిమిల్లి సత్యనారాయణ, రావి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలపై దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలి



అత్తిలిలో దళిత ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న గంజి మధు

అత్తిలి: ఎస్సీలపై జరుగుతున్న దాడులను ఐక్యతతో ఎదుర్కొనాలని దళిత ఐక్య వేదిక నియోజకవర్గ నాయకుడు గంజి మధు అన్నారు. ఆదివారం సాయంత్రం అత్తిలి సీపీఎం కార్యాలయంలో దళిత ఐక్యవేదిక సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గంజి మధు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా ఎస్సీలపై వరుస దాడులు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే అంతా కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీల రిజర్వేషన్‌లు కాపాడుకోవడం కోసం, ఎస్సీలలో ఐక్యత నింపడం కోసం గ్రామ స్థాయి నుంచి నిర్మాణం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అత్తిలి మండల ఐక్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బుంగా ఇమ్మానియేలు, అధ్యక్షుడిగా పానుగు వినయ్, ఉపాధ్యక్షులుగా బత్తుల మోహన్, కుసుమే చంటి, ప్రధాన కార్యదర్శిగా బట్టు నాగరాజు, సహాయ కార్యదర్శులుగా మురాల చింటూ, యాళ్ల ఇస్రాయేలు, కోశాధికారిగా కుసుమే కిట్టు, సభ్యులుగా వెంకట్, కలవపూడి సందీప్, సరిపల్లి రామకృష్ణ, మేడపాటి వెంకి, బద్దా యెషయ్య, చుక్కా పండు ఎన్నికయ్యారు.

## కళాకారుల సంఘం సేవలు అభినందనీయం



మున్సిపల్ కల్యాణ మండపంలో సంగీత కచేరీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంఘం సేవలు అభినందనీయమని పలువురు కళాకారులు కొనియాడారు. 149వ నెలవారీ సంఘ సమావేశం పట్టణంలో ఆదివారం రాత్రి 3వ వార్డు వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలోని నాన్న మునిసిపల్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ అధ్యక్షత వహించారు. దశిక శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంగీత కచేరి నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి తానింకి శ్రీహరికి గౌరవ సత్కారం, కళాకారుడు ఈవీ సత్యనారాయణకు కళా సత్కారం, లెక్చరర్ బైర్ల సురేంద్రకు ఉద్యోగ పురస్కారం, హరికథ కళాకారిణి శ్రీవాణి (దువ్వ)కు ఆర్థిక సత్కారం చేశారు. ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి బాబురావు, శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతి, పెంటపాడు ఎంఈఓ పాల్గొన్నారు.

# ఇసుక దొరక్క.. పనులు లేక





తణుకులో ఉచిత ఇసుక అందించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు (ఫైల్), తణుకులో ప్రైవేటు నిర్మాణం కోసం గతంలోనే నిల్వ చేసిన ఇసుక

తణుకు అర్బన్: ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేయగా.. కనీసం కొందామంటే ఇసుక దొరక్క భవన నిర్మాణాలు నిలిచి పోయాయి. దీంతో పనులు లేక భవన నిర్మాణ రంగ కార్మికులు అల్లాడుతున్నారు. పనుల్లేక పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి పార్టీని గెలిపిస్తే ఉచితంగా ఇస్తామని ఊదరగొట్టి 100 రోజులు దాటినా ఉచిత ఇసుకను అటకెక్కించారు. వేలాది రూపాయిలు వెచ్చిస్తేనే కాని ఇసుక దొరకని పరిస్థితి సృష్టించడంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. నిర్మాణ రంగానికి అనుసంధానంగా జరిగే వ్యాపారాలు నష్టపోయాయి. భవన నిర్మాణ కార్మికులను ఉద్ధరిస్తాం.. ఉచిత ఇసుక ఇస్తాం అన్న మాట ఏది బాబూ అంటూ భవన నిర్మాణ కార్మికులు నిలదీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన ఇసుక నిల్వలను కూటమి నేతలు అక్రమ మార్గంలో అమ్ముకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇసుక సరఫరా లేకపోవడంతో నిర్మాణ రంగంలో ఉండే కూలీలతోపాటు తాపీమేస్త్రిలు, సెంట్రింగ్, వడ్రంగి పనివారు, ఎలక్ట్రీషియన్స్, పెయింటర్లు, ప్లంబర్లు, ఐరన్ పనివారు పనుల్లేక అల్లాడుతున్నారు. ఎలక్ట్రికల్, కలప, ప్లంబింగ్ మెటీరియల్ దుకాణాలు సైతం వ్యాపారాలు లేక అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.

**ఆన్‌లైన్ బుకింగ్‌లో బ్రోకర్ల ఇష్టారాజ్యం**

ఇటీవలే ఆన్‌లైన్ బుకింగ్ తెరిచినప్పటికీ బ్రోకర్స్‌కు తప్ప నిర్మాణదారులకు అందని దుస్థితి. పేరుకే ఆన్‌లైన్‌లో బుకింగ్ అని.. ఆ సైట్‌లు కూడా ఓపెన్ కావడంలేదని అదే ఇసుక విక్రయాలు జరిపే బ్రోకర్లను సంప్రదిస్తే గతంలో మూడు యూనిట్లు ఉన్న ఇసుక లారీ రూ. 9 వేలు కాగా, నేడు రూ.15 వేలకు అమ్ముతున్నారని చెబుతున్నారు. దీంతో ఇసుక దొరక్క, బ్రోకర్ల వద్ద కొనుగోలు చేయలేని స్థితిలో నిర్మాణదారులు ఉండడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**గిరాకీ లేని ట్రాన్స్‌పోర్టు వాహనాలు**

ఉచిత ఇసుక లేకపోగా డబ్బులు పెట్టి కొందామన్నా ఇసుక దొరక్కపోవడంతో ఇసుక సరఫరా చేసే వాహనాలు కూడా మూలకు చేరాయి. ఇసుక రవాణాను నమ్ముకుని మూడు, ఐదు యూనిట్ల లారీలను కొనుగోలు చేసిన యజమానులు తమ వాహనాలను తిప్పే పరిస్థితి లేక అల్లాడిపోతున్నారు. వాహనాలకు ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. లారీలు, ట్రాక్టర్లు ఇళ్ల ముందే పెట్టుకుని చూడాల్సి వస్తుందని వాపోతున్నారు.

### నిర్మాణాలు నిలిచిపోయాయి



ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని నెరవేర్చలేక పోయింది. ఉచితం కాదుకదా డబ్బులు పెట్టినా ఇసుక దొరకని పరిస్థితితో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో నిర్మాణ రంగంపై ఆధారపడ్డ కార్మికులు పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక ఆధారంగా నిర్వహించే 40 రకాల వ్యాపారాలు ఆగిపోయాయి. ఇసుక ఉచితంగా అందిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడలేదు. గోదావరి ప్రాంతం సమీపంలో ఉన్నప్పటికీ ప్రకృతి అందిస్తున్న ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన దుస్థితి.

– పీవీ ప్రతాప్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

### నష్టపరిహారం ఇవ్వాలి



ఇసుక సరఫరా సక్రమంగా లేకపోవడంతో భవన నిర్మాణాలు సాగక వడ్రంగి పనిపై ఆధారపడ్డ వారంతా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకునేందుకు అల్లాడిపోతూ అప్పుల పాలైపోతున్నారు. ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా ఇసుక సరఫరానే కాని విధంగా చేసినందుకు వడ్రంగి మేస్త్రీలకు నష్టపరిహారం అందచేయాలి.

– గోడి నాగబాబు, కార్పెంటర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, తణుకు